# నల్లమలలో గిరిజనుల ఆకలి చావులు

## ఎపిసిఎల్‌సి ఆరోపణ

పాలమూరు, జులై18(ప్రభాతవార్త):జిల్లాలోని నల్లమల అడవి ప్రాంతంలో నివసించే గిరిజనులు ఆకలి చావులకు గురవుతున్నారని రాష్ట్ర పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి టి.పురుషోత్తం ఆరోపించారు.గిరిజనుల సంక్షేమ,అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికి గిరిజనుల ఆకలి చావులను అరికట్టలేకపోయిందని ఆయన విమర్శించారు.నల్లమల అడవి ప్రాంతంలో ప్రధానంగా చెంచు గిరిజనులు నివసిస్తున్నారని వీరు ఇతర గిరిజనుల కంటే చాల వెనుకబడి ఉన్నారని ఆయన తెలిపారు.అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని గిరిజన కార్పోరేషన్ వారికి విక్రయించి వారిచ్చే ధాన్యంతో జీవితం గడుపుతున్నారని ఆయన తెలిపారు.నల్లమలలో గిరిజనుల ఆకలి చావులపై ఎపిసిఎల్‌సి నిజ నిర్ధారణ కమిటీ వాస్తవాలను సేకరించిందని ఆయన తెలిపారు.నిజనిర్ధారణ కమిటీ తరపున నివేదికను ఆయన పత్రికలకు విడుదల చేశారు.దట్టమైన అడవుల్లోని 30 గూడాలలో చెంచు గిరిజనులు నివసిస్తున్నారని ఆయన తెలిపారు.వీరికి సబ్సిడి ధరకు ప్రభుత్వం ఇచ్చే బియ్యం తప్ప మరో తిండి ధాన్యం లభించదని ఆయన పేర్కొన్నారు.చాలా మందికి రేషన్‌కార్డులు లేవని ఆయన తెలిపారు.బైరాపురం గ్రామానికి చెందిన చిగుర్ల గురవయ్య (40),గంగయ్య(50) ఈర్లపెంట గ్రామానికి చెందిన లింగమ్మ,బయ్యమ్మలతో పలువురు తినడానికి తిండి దొరకక పస్తులుండి ఆకలిచావులకు గురైనట్లు నిజనిర్ధారణ కమిటీలో తెలిసిందని ఆయన తెలిపారు.ప్రభుత్వం ఇచ్చే బియ్యం సరిపడక కుటుంబం ఆకలితో తల్లడిల్లుతుంటే చూడలేక మేడి మూంకుల గ్రామానికి చెందిన నిమ్మల లింగయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు.అప్పాపురంలో గల గిరిజన కార్పోరేషన్ సెల్స్ డిపో నుంచి ప్రతి రోజు నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సి ఉండగా వారానికి ఒక రోజు మాత్రమే సెల్స్ డిపో తెరిచి ఉంచుతున్నారని ఆయన ఆరోపించారు.కొన్ని సందర్భాల్లో వారానికి ఒక రోజు కూడ సెల్స్ డిపో తెరవరని ఆయన తెలిపారు.దీంతో గిరిజనులు నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయలేక పస్తులకు లోనవుతున్నారని ఆయన తెలిపారు.గిరిజన కార్పోరేషన్ గిరిజనుల నుంచి తీసుకున్న జిగురుకు తక్కువ ధర చెల్లించి వారిచ్చే నిత్యవసర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని పురుషోత్తం ఆరోపించారు.చెంచు గిరిజనులు దోపిడికి గురికావడమే కాకుండా అనేక రోగాలకు లోనై చావులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.వీరి గురించి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.గిరిజనుల ఆకలి చావులను అరికట్టాలని ,ఆకలిచావులకు గురవుతున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని .గిరిజనులందరికి రేషన్ కార్డులను మంజూరు చేసి నిత్యవసర వస్తువులను అందుబాటులో ఉంచాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.